


కథ

-కందుకూరి రాజకుమారి

# ఉచితమా - ఓ - చిత్రమా

"యావండీ"

"అమ్మా"

"యావండీ"

"అమ్మా"

"ఏమిటే నీ గోల.."

రెండు గొంతులు ఒకేసారి పలికాయి. ఒకటి రాఘవది మరొకటి అతడి భార్య సీతది. రాఘవ భార్య పిలుపునకు బదులిస్తూ విసుక్కుంటే, సీత కూతురు మీనా అల్లరికి విసుక్కుంటూ బదులిచ్చింది.

"నేను సీరియస్‌గా పేపరు పట్టుకుని మీ దగ్గరకొస్తుంటే..ఇది మధ్యలో అడ్డుపడిపోతోంది చూడండి" సీత ముచ్చటగానే కంప్లైంట్ చేసింది.

"నాన్నా! నాకు తెలుసు అమ్మ నిన్నెందుకు పిలుస్తోందో. పేపరు పట్టుకుని 'యావండీ' అంటే దాని అర్థం నీకు కూడా తెలుసు. అమ్మ చెప్పక్కర్లేదు. కరెక్టేనా?" మీనా సంజాయిషీలో నిబ్బరం.

"యావండీ" అని తనని మీనా అనుకరించగానే ముచ్చటగా చెయ్యెత్తింది సీత.

"ఓ! అదా! కరెక్టే. ఏదో ప్రపంచ విషయాలు తెలుస్తాయి కదా అని మీ అమ్మకోసం తెలుగు పేపరు తెప్పిస్తుంటే తను నా మనీపర్సుకే మెనీ పోట్లు పొడుస్తోంది"

"అంతేలెండి! మనూరు ప్రపంచపటంలో భాగం కాదా? మనూర్లో విషయాలు తెలుసుకుంటే ప్రపంచ విషయాలు తెలుసుకున్నట్లు కాదా?" సీత వాదనకి దిగింది, అసలు విషయం మర్చిపోయి.

"నిజమే సీతా! మనూరు ప్రపంచపటంలో భాగమే! కానీ నా బాధల్లా మనూరిలో భాగంగా ఉన్న షాపుల గురించీ, వాటి గురించి పేపరుతోపాటు వచ్చే పాంప్లెట్స్ గురించీ! అవి పేపరులో భాగం కాకపోయినా నా మనీపర్సుని పొడుస్తున్నాయి. అవికాక లోకల్ సప్లిమెంట్లో అడ్వర్టైజుమెంట్లు..ఇక నా పర్సు పడే పాట్లు చెప్పాలా? తెలుసుకుందుకు పేపర్లో ఇవి తప్ప విశేషాలే లేవా?" వాపోయాడు రాఘవ.

రాఘవ మాటలతో అసలు విషయం గుర్తుకొచ్చిన సీత మళ్ళీ తన ధోరణిలోకి వచ్చేసింది. "అదేనండీ! బొమ్మన బ్రదర్స్‌లో సేల్‌ట- ఓ చీర కొంటే ఇంకోటి ఫ్రీ. బిల్లు వెయ్యి రూపాయలు దాటితే వంద రూపాయలు విలువచేసే బహుమతి. అంతేకాక మనింట్లో ఉన్న బొమ్మన బ్యాగులన్నీ చిరిగిపోయాయండీ. అక్కడ బట్టలు కొంటే చక్కగా బ్యాగులిస్తారు. అవి ఎంత పనికొస్తాయో మీకూ తెలుసు! అదీకాక పక్కనే బిగ్‌బజార్లో కూడా చాలా ఆఫర్లున్నాయ్"

"అమ్మా! బిగ్ బజార్ బొమ్మన బ్రదర్స్ పక్కనే ఎక్కడుందే?" తల్లి వాగ్ధాటికి బ్రేకేసింది మీనా.

"అమ్మకి ఎక్కడేముందో పట్టదు. డ్రైవర్ని నేనున్నానుగా" ముచ్చటగా భార్యని చూశాడు రాఘవ.

"షాపెక్కడుందీ అన్నది కాదు కొశ్చెను. ఆఫరెలాంటిదీ అన్నది పాయింటు. నేను ఎక్కడెక్కడ ఆఫర్లున్నాయో లిస్టు వేసుంచాను. ఎలాగూ పండగొస్తోంది కదా, ఆఫరున్నచోటే షాపింగు చేద్దాం, షాపింగుకి షాపింగూ, ఆదాకి ఆదా..అప్పుడు చెప్పండి మీ పర్సుకి పడ్డవి పోట్లో, టాకాలో" అంది సీత.

"అది నే చెప్తాలేవే! నాన్న పాపం నిన్నేమీ అనరు, అనలేరు. ఈ ఫ్రీ గిఫ్టులు, ఆఫర్లు నీలాంటి వాళ్లచేత అవసరానికి మించి ఖర్చు పెట్టించడానికే. మనమేమో ఆదా అనుకుని సంతోషపడతాం కానీ నిజానికా గిఫ్టులు పెద్దగా పనికిరావు సరికదా, ఆఫరిచ్చి మరీ అమ్మాల్సొస్తోందంటే అసలా సరుకు క్వాలిటీనే అనుమానించాలి. మంచివైతే ఆఫర్లేకపోయినా అంతా కొంటారు" వాదిం(బోధిం)చింది మీనా.

"మా బంగారుతల్లికి ఎంత తెలివి?" కూతుర్ని ముచ్చటగా చూస్తూ మురిసిపోయాడు రాఘవ.

భర్త మురిపాన్ని తనూ పంచుకున్న సీత, "సరే! షాపింగుకి ఎప్పుడు వెడుతున్నాం?" అంది.

* * *

"ఇదిగో యమునా! పెళ్ళివారు దగ్గర్లోనే ఉన్నారని ఫోనొచ్చింది. అంతా రెడీయేనా?" కంగారుగా అన్నాడు ధర్మారావు.

"కంగారు పడకండన్నయ్యా! అంతా రెడీ! మేమున్నాంగా?" హామీ ఇచ్చింది సీత.

"సీతా! ఫ్రెండూ కొలీగూ ఐనందుకు మీనా, సుగుణకి కంపెనీ ఇచ్చి దాని టెన్షను చాలావరకూ తగ్గిస్తే, ఇరుగూపొరుగూ ఐనందుకు నువ్వు నాకు కొండంత ధైర్యాన్నిచ్చావ్. మీరిద్దరూ ఉండబట్టికానీ మీ అన్నయ్యకే కాదు, నాకూ కంగారుగా ఉండేది" అంది ధర్మారావు భార్య యమున.

"ఈమాత్రం సాయానికే అలా అనేయకొదినా! మాకెన్నిసార్లు మీరు అండగా నిలబడలేదు. మన మధ్య బంధుత్వం లేకపోయినా, మీరు మాకు స్వంత వాళ్ళ కంటే ఎక్కువ"

"నాన్నా! వాళ్ళొస్తున్నట్టున్నారు. ఇప్పుడే ఓ కారు మన సందు చివర మలుపు తిరిగింది" అన్నాడు ధర్మారావు కొడుకు రమణ. అతడు అప్పుడే ఆఫీసు నుంచొచ్చి హడావిడిగా బైక్ పార్కు చేసి లోపలికొచ్చాడు. చెల్లెల్ని పలకరించడానికి లోపలికెళ్ళేలోగా ఇంటిముందు కారాగింది. అందులోంచీ పెళ్ళి వారు దిగారు!

* * *

"అబ్బాయి బాగున్నాడు. షాపింగులో వచ్చే ఫ్రీ గిఫ్టులా ముచ్చటగా" అంది సీత.

"అమ్మా! ఇక్కడ కూడా షాపింగు గోలేనా! ఐనా ఏం ఫ్రీగిఫ్టులో..ఆఫర్లో.. వచ్చిందేదీ తిన్నగా పనిచేయదు. పెళ్ళికొడుకుని ఫ్రీ గిఫ్టుతో పోలిస్తే సుగుణకి టెన్షను. నాన్నకి షాపింగు ఖర్చు గుర్తొచ్చి టెన్షను" జేబురుమాలుతో ముఖానికి పట్టిన చెమటను తుడుచుకుంటున్న తండ్రిని చూస్తూ అంది మీనా.

"దాని మాటలకేం సీతా! ఉక్కకి చెమట్లు పడితే ముఖం తుడుచుకుంటున్నానంతే!" తన వంక గుర్రుగా చూస్తున్న భార్యకి సంజాయిషీ యిచ్చాడు రాఘవ.


మళ్ళీ తన అభిప్రాయం అడగడం ఎక్కడ మర్చిపో

తారో అనుకుందేమో "బాగానే ఉన్నాడు ఆంటీ, కానీ నాకెందుకో మరీ అంత హేపీగా అనిపించడం లేదు" అంది సుగుణ ఫ్రాంక్‌గా తన అభిప్రాయం చెప్తూనే తండ్రి వంక చూసింది ఏమంటాడో అన్నట్లు.

"నిజం చెప్పాలంటే నాకేం లోటు కనిపించడం లేదు. వాళ్ళంతా చాలా మర్యాదగా ప్రవర్తించారు. ఎక్కడా మగపెళ్ళివారన్న అహంకారమే లేదు. అబ్బాయి సంస్కారవంతుడిలా ఉన్నాడు. ఏమంటావ్?" భార్య వంక చూశాడు ధర్మారావు.

"ముందు నేనో మాట చెప్పాలి. వాళ్ళు చాలా మంచివాళ్ళని నా ఫ్రెండు చెప్పాడు. పెళ్ళికొడుకు వాడి కజిన్" అందుకున్నాడు రమణ.

"కానీ ఎక్కడో ఏదో తేడా వుంది. వాళ్ళ బిహేవియర్ నాకు అతివినయం..లాగా అనిపించింది"



తటపటాయిస్తూ అంది సుగుణ.

"ఈమధ్య అమ్మాయిలకి పొగరెక్కువైంది. సంపాదిస్తున్నామన్న ధీమాతో. అబ్బాయిలకి వంకపెట్టడం ఫ్యాషనైపోయింది. మా టైంలో అమ్మానాన్నా ఎవర్ని చూపిస్తే వాళ్ళని చేసుకుని చచ్చినట్లు పడుందేవాళ్ళం" కూతురి మాట పూర్తికాకుండానే దెబ్బలాట మొదలెట్టింది యమున.

"పాపం! మధ్యలో మా నాన్ననెందుకుంటావు?" అంది సుగుణ. ధర్మారావు ముసి ముసిగా నవ్వితే- చచ్చినట్లు పడుండడాన్ని కూతురు విశ్లేషించిందని గ్రహించిన యమున మొహమాటపడి, "ఈ కాలం పిల్లలు-కోడిగుడ్డుకి ఈకలు తీస్తారు" అంటూ సీతని తీసుకుని లోపలికెళ్ళింది. వెడుతూ వెడుతూ సీత, "అబ్బాయి తల్లిదండ్రులు ముచ్చటగా ఉన్నారు. మొన్నొచ్చిన ఫ్రీ గిఫ్టు...స్పూను, ఫోర్కు జతలా.." అనడం విని మీనా తనలో తనే నవ్వుకుంది.

"చూడమ్మా! ఇందులో బలవంతమేం లేదు. నీకు నచ్చితేనే ప్రొసీడవుదాం. లేదనుకో కథ ఇంతటితో సమాప్తం!" మిత్రుని అభిప్రాయాన్నే వెలిబుచ్చాడు రాఘవ.

"అంతేనే! నీకిష్టం లేని పెళ్ళి నేనూ జరగనివ్వను. కానీ ముందే నువ్వు వద్దనేయకు, వాళ్ళేమంటారో చూద్దాం, సరేనా?" చెల్లెల్ని అనునయించాడు రమణ.

"సరేరా! కానీ వాళ్ళొద్దంటే మాత్రం, ముందు రిజెక్టు చేసింది నేనన్న విషయం మీరంతా గుర్తుపెట్టుకోవాలి మరి!" అహం పురుషుల సొత్తు మాత్రమే కాదన్నట్లు అంది సుగుణ.

"నీ భయం అర్థం లేనిది. మా సుగుణ బంగారం. అది కాదనాలి తప్పు దాన్నెవరు కాదంటారు? తనకి కావలసినవాణ్ణి అదే సెలెక్టు చేసుకుంటుంది" ముచ్చటగా అన్నాడు ధర్మారావు.

* * *

"యమునా! పెళ్ళివారేమైనా కబురు చేశారా? చందన బ్రదర్సులో పెళ్ళి పట్టుచీరలు కొంటే ఒక బంగారు నాణెం ఫ్రీట. ఇంకా తుమ్మిడి బ్రదర్సులో.." గుమ్మంలో అడుగుపెడుతూనే అంది సీత.

"ఆయన పెళ్ళివారింటికే వెళ్ళారు సీతా! రమణ కూడా ఆఫీసునుంచి అటు వెడతానన్నాడు" అంటూ

హాల్లోకొచ్చింది యమున.

"సరే- ఐతే సాయంత్రం వస్తానేం! పక్కింటి కమలా నేనూ లైఫ్‌స్టైల్‌కి వెడుతున్నాం. అక్కడేదో వన్ ప్లస్ వన్ ఆఫర్‌లో చొక్కాలూ, షూసూ దొరుకుతున్నాయట. వాళ్ళబ్బాయికి తీసుకుంటుందట! మళ్ళీ మీనా ఆఫీసు నుంచొస్తే, జోకులు మొదలెడుతుంది. అన్నట్లు, నువ్వొ రాకూడదూ! పెళ్ళి కొడుకుకి పెట్టాల్సిన బట్టలు కొనే యచ్చు"

"ఆలూ లేదు, సూలూ లేదనీ- అయినా ఈ సేల్సె ప్పుడూ ఉండేవేగా, నాకు మూడ్ లేదు సీతా! నువ్వె ళ్ళిరా" అని సీతని పంపేసింది యమున.

* * *

సాయంత్రం రాఘవ ఇంట్లో రెండు కుటుంబాలూ కలిశాయి.

"వాళ్ళు చాలా మంచివాళ్ళలా ఉన్నారు రాఘవా! కట్నం ప్రసక్తే లేదు. మనమ్మాయి చదువు, అందం, వినయం అన్నీ చూసి ఫ్లాటయిపోయారు" కూతుర్ని ముచ్చటగా చూస్తూ చెప్పాడు ధర్మారావు.

"అలా అని వాళ్ళు కట్నం వద్దనీ అనలేదు. ఇంతా అని చెప్తేనే బెటరు కదా! నాన్న రెండు లక్షలిస్తానని ఆఫర్ చేస్తే, కాదనలేదు సరికదా, ఆడపడుచు లేదు కాబట్టి అత్తగారి లాంఛనాల కింద అదనంగా ఓ అర లక్ష ఇస్తే చాలన్నారట. లక్కీగా పెళ్ళికొడుకు అన్నయ్య భార్య తనకేం వద్దనడంతో, అంతటితో ఆగాయ్ లాంఛనాలు. ఇంకా బంగారం నాకే చాలా ఉంది కాబట్టి- అదే వారు సగం మేము సగం పెళ్ళిలో పెడదామన్నారట" కొంచెం కోపంగానే చెప్పింది సుగుణ.

"నాన్నే తనకి తానుగా మా తాహతుకి తగ్గట్టు కట్నమిస్తామన్నారు తప్పితే..వాళ్ళు నిజంగానే ఏమీ అడుగలేదు. కానీ చెప్పుకుందుకు గొప్పగా ఉంటుందని అత్తగారికో యాభైవేలు లాంఛనాలు. చెల్లికి పెట్టడానికి దాని నగల్లో సగం అడిగారు" రమణ వివరిస్తూనే చెల్లెలి ముఖభావాలు గమనిస్తున్నాడు.

"అబ్బాయి పెద్దవాళ్ళనిబ్బంది పెట్టడమెందుకంకుల్! సుగుణ పొద్దున్న ఆఫీసుకెడితే సాయంత్రమెప్పుడో ఇంటికి వస్తుంది. తనకి సాయమెందుకు?" అంది మీనా.

రమణ, ధర్మారావు మొహమొహాలు చూసుకున్నారు.

"అంటే ఆడవాళ్ళుద్యోగం చేయడం వాళ్ళింటా వంటా లేదట. ఏదో పెళ్ళికి ముందు టైంపాస్ కోసం చేసుండొచ్చుకానీ..పెళ్ళయ్యాక మానేయాలంది అత్తగారు"

"అబ్బాయేమన్నాడు?" అడిగింది సుగుణ.

"ఈ మాటలేవీ అబ్బాయుండగా జరుగలేదు. రమణ నాకు సాయంగా ఉండాలని నాకోసం పర్మిషను తీసుకునొచ్చాడు కానీ అతను ఆఫీసుకెళ్ళిపోయాడు" పెళ్ళివారింట్లో అనిపించలేదు కానీ - ఇప్పుడు వివరిస్తుంటే ధర్మారావుకేదో తేడాగా అనిపించింది.

"ఈ ఆఫరు చాలా బాగుందన్నయ్యా! రెండున్నర లక్షలతో, మనమ్మాయికి ఉద్యోగం నుంచి రెస్టు, ప్లస్ అత్తమామల తోడు ఫ్రీ! ఆలోచించండి. నాకు నచ్చింది, యావండీ, మీరేమంటా.." భర్త జేబురుమాలుతో ముఖం తుడుచుకోవడం చూసి, ఉక్రోషంగా ముఖం తిప్పేసుకుంది సీత.

* * *

"యావండీ"

"అమ్మా"

"యావండీ"

"అమ్మా"

"ఆంటీ!"

"ఇదేమిటీ కొత్త పిలుపూ!" అంటూ టీవీ నుండి ముఖం తిప్పిన రాఘవకి చేతిలో పేపరుతో భార్య, వెలిగిపోతున్న ముఖాలతో సుగుణ, మీనా కనిపించారు.


"ఆంటీ! స్వీట్ తీసుకోండి. అంకుల్! మీరూను-ఎల్లుండి నాకు ఎంగేజిమెంటు" సంతోషంతో మెరిసిపోతున్న సుగుణ అందరికీ స్వీట్సందించింది.

"కంగ్రాచ్యులేషన్సమ్మా!" మనస్ఫూర్తిగా విష్ చేశాడు రాఘవ.

---

## సోయగాల సెలీనా!


బాలీవుడ్ భామ సెలీనా జైట్లీ 'సూర్యం' అనే తెలుగు సినిమాలోనూ నటించిందని తెలుసు కదా! అందాల్ని ఆరేయడంలో ఏమాత్రం వెనకాడని ఈ ముద్దుగుమ్మ ఇటీవల 'గోల్‌మాల్ రిటన్స్' సినిమాలో కామెడీ పాత్ర చేసింది. దీనికిగాను ఓ సంస్థవారు ఆమెకి అవార్డునిచ్చారు. అందుకు తెగ సంబరపడుతూ సెలీనా- 'ఒక రకంగా చెప్పాలంటే ఎక్స్‌పోజింగ్ చేయడం చాలా తేలిక. కానీ కామెడీని పండించడం మాత్రం మాటలు కాదు' అని సెలవిచ్చింది. అందుకే కాబోలు ఎక్స్‌పోజింగ్ తెగ చేస్తుంటుంది సెలీనా- అని గుసగుసలాడుకుంటున్నారు సినీజనాలు.



"చాలా సంతోషం. మొత్తానికా అబ్బాయితో పెళ్ళికొప్పుకున్నావన్నమాట!" సంబరపడింది సీత.

"అంతా మీ చలవే ఆంటీ! మీరెప్పుడయితే ఫ్రీ గిఫ్టు అన్నారో, అప్పుడే మన మీనాకి బల్బు వెలిగింది. పెళ్ళివారి గురించి ఆరా తీసింది. తనూ రమణా కలిపి పెద్ద ఇన్వెస్టిగేషనే చేశారు" అంది సుగుణ.

సీత ఆసక్తిగా వింటోంది. రాఘవ కూతురు వంక ప్రశ్నార్థకంగా చూశాడు.




"అమ్మా! ఆ మధ్య మూడు పట్టుచీరలు కొంటే ఓ మిక్సీ ఫ్రీగా వచ్చింది కదా! అది మన సుగుణకి పెళ్ళిగిఫ్టుగా ఇద్దాం సరేనా.." తండ్రివంక అర్ధవంతంగా చూస్తూ కొత్తటాపిక్ మొదలెట్టింది మీనా.

"అదెందుకూ! అందులో మొన్న పచ్చడి గ్రైండరు చేయబోతే పొగలొచ్చి ఫ్యూజుపోయింది. బాగుచేయించుకుని వాడుకుంటానంటే పనిమనిషికిచ్చేశాను. సుగుణకి కొత్తది, మంచి కంపెనీది కొనిద్దాం" అంది సీత.

"పోనీ ఆ చీరల్లో ఒకటి దీనికి పెళ్ళిలో పెడదామా?" సన్నగా నవ్వుతూ అడిగింది మీనా.

"అబ్బే. అవి మరీ అంత బాగోలేవే, ఒకదానికి చిరుగుంటే దార్నింగుకిచ్చాను. ఇంకోటి అక్కడక్కడ వెలిసినట్లుంది. మనమెప్పుడైనా బైటకి కట్టుకోవచ్చు. కానీ పెళ్ళిలో సుగుణకి మంచి చీర కొనిపెడదాం"

రాఘవకేదో అర్ధమవుతున్నట్లనిపించినా కలగజేసుకోకుండా వింటున్నాడు.

"మరైతే మొన్న అదేదో పాలపొడి కొంటే ఓ గ్లాసు ఫ్రీగా వచ్చింది చూడు, దాహంగా వుంది. దాంతో కాసిని మంచినీళ్ళిస్తావా!" అంది మీనా.

"దాహమేస్తే మంచినీళ్ళిస్తాను, కానీ ఆ గ్లాసెందుకు? దానికి చిన్న బీట వుంది. ఐనా ఏంటీ- నాకొచ్చిన ఫ్రీ గిఫ్టులు బాగోలేవనిపించాలనా ఇవన్నీ అడుగుతున్నావ్!" అంది సీత కొంచెం చిరాగ్గా.

"పాయింటుకొచ్చావ్. ఇదే పాయింటు మీద మేము అదే రమణా, నేనూ-కొంచెం ఆరా తీసాం. చాలా విషయాలు బైటపడ్డాయి" మీనా ఆగి తల్లిచ్చిన మంచినీళ్ళు తాగి, మళ్ళీ కొనసాగించింది.

"ఆ అబ్బాయికొక్కడే అన్నయ్య. అతనికి ఏడేళ్ళ క్రితం పెళ్ళైంది. పెళ్ళైనప్పట్నుంచీ అత్తమామలు పెద్ద కొడుకుతో ఉంటున్నారు. స్వతహాగా ఉన్న గయ్యాళితనానికి వయసుతో వచ్చే చాదస్తం తోడై వాళ్ళెక్కడుంటే అక్కడ మనశ్శాంతి కరువైపోతుందట. చుట్టాలెవ్వరూ వాళ్ళని ఒక పూటకంటే ఎక్కువ భరించలేరదట. కొడుకునన్న బాధ్యతతో చిన్నబ్బాయి రమ్మన్నా, ఒక్కడివే ఉండగా రమ్మన్నా రాము, పెళ్ళైతే వచ్చి పొమ్మన్నా పోమని కచ్చితంగా చెప్పేశారట. చిన్నప్పట్నించీ అనుభవమైనా కొడుకులు వాళ్ళ ధాటికి అలవాటుపడలేక- ఏదో ఒక వంకపెట్టి తప్పించుకు తిరుగుతారట. అలా పెద్దకొడుకు క్యాంపులకెళ్ళడం మొదలెడితే, ముందుచూపుతో చిన్నకొడుకూ అనుసరిస్తున్నాట్ట. పాపం పెద్దకోడలు వాళ్ళని ఏడేళ్ళ నుంచి భరిస్తోందట. మరిదికి పెళ్ళైతే కొంతైనా తప్పించుకోవచ్చని విపరీతంగా పెళ్ళి ప్రయత్నాలు చేస్తోందట. ఆ ప్రయత్నాల్లో భాగమే- మన సుగణ పెళ్ళిచూపులు. అబ్బాయి కజిన్ చేత వాళ్ళు మంచివాళ్ళని రమణకి చెప్పించడమూను.." ఊపిరి పీల్చుకుంది మీనా.

"చిన్నకొడుకు పెళ్ళైతే తమ వేధింపులకి స్పందనలో కాస్త వెరైటీ ఉంటుందని అతడి తల్లిదండ్రులు కట్నం వద్దంటున్నారు. తోటికోడలు లాంచనాలొద్దనడానికి కారణం - మరిదితో చేసుకున్న ఒప్పందం. పెళ్ళయ్యాక జీవితాంతం తల్లిదండ్రుల్ని తన దగ్గరే ఉంచుకుంటానని ఆ మరిది వదినకి మాటిచ్చేట్ట" మిగతా కథ పూర్తి చేసింది సుగుణ.

"ఇది నీ ఫ్రీ గిఫ్టుల చరిత్ర" ముగించింది మీనా.

"మరి అబ్బాయి.." అని ఏదో అనబోతున్న సీతను



## క్రేజ్ కోసం..

బికినీ పిచ్చి ప్రేక్షకుల కంటే తారలకే ఎక్కువగా వున్నట్టు కనిపిస్తోంది. ఆమధ్య 'తషన్'లో టూపీస్ బికినీతో దర్శనమిచ్చిన కరీనాకపూర్ మరోసారి ఇలాంటి గెటప్‌తో కనిపించబోతోందిట. అక్షయ్ కుమార్ హీరోగా నటిస్తున్న 'కంభక్త్ ఇష్క్' అనే సినిమాలో కరీనా మళ్లీ బికినీతో అందాల విందు చేయబోతోందని బాలీవుడ్ వార్తలు చెబుతున్నాయి. ఓ వైపు సైఫ్‌తో ఇదిగో పెళ్లి అదిగో పెళ్లి అంటూనే మరో వైపు ఇలా క్రేజ్ కోసం ఈ తాపత్రయం ఏమిటో కదా! అని ముక్కున వేలేసుకుంటున్నారు చాదస్తంగల వాళ్లు.

మధ్యలోనే ఆపి, చెప్పసాగింది మీనా.

"ఇక అసలు సరుకు సంగతికొస్తే..ఆ అబ్బాయి కన్నీ సుగుణాలే. రెండంటే రెండు లోపాలు తప్ప! ఒకటి తనని నమ్మి తనకోసం తన వారందర్నీ వదిలొచ్చిన అమ్మాయి సుఖాన్ని ముందుగానే వదినకి తాకట్టు పెట్టేసి, తను మాత్రం క్యాంపులమీద తిరుగుతూ సుఖపడాలనుకునే మనస్తత్వం! రెండు - పెళ్ళంటే కష్టసుఖాలను పంచుకోవడం అనే సూక్తికి కొత్త అర్థాన్నిచ్చిన వ్యక్తిత్వం. భార్యతో సుఖాల్ని తాను పంచుకుని, తన కష్టాల్ని భార్యకి వాటాగా ఇవ్వడం!"

"అందుకే, నేనా సంబంధం వద్దనుకున్నాను" పూర్తి చేసింది సుగుణ.

"ఎదుర్కొని పరిష్కారం వెతుక్కోవాలే కానీ సమస్య నుంచి పారిపోకూడదు. అదీ వరుడి అన్నయ్య చేసిన, వరుడు చేస్తున్న తప్పు. ఆ ఇంటి కోడలిమీద పూర్తి సానుభూతి ఉన్నా- తెలిసి, తెలిసీ, మన సుగుణకి ఆ ఇంటి కోడలి అనుభూతి ఇవ్వాలనుకోలేం కదా!" ముగించింది మీనా.

"అలాంటప్పుడు ఈ స్వీట్సేమిటి? మరి ఎంగేజిమెంటెవరికి?" అయోమయంగా అంది సీత.

"అది నేను చెప్తానాంటీ!" అంటూ రంగప్రవేశం చేశాడు రమణ. చేతిలో మరో స్వీట్స్ ప్యాకెట్‌తో.

వెంటనే మీనా ఏదో పనున్నట్టు లోపలికెళ్ళిపోయింది.

"మీ మీనాని నేను పెళ్ళి చేసుకుందామనుకుంటున్నాను. మీకభ్యంతరముండదనే నా ఆశ" ఉన్నట్లుండి అతడి నోట వచ్చిన ఈ ఊహించని ప్రతిపాదనకి భార్యాభర్తలిద్దరూ తెల్లబోయారు.

"కహానీ మే ట్విస్ట్" సుగుణ నవ్వుతూ మీనాని లోపల్నుంచి లాక్కొచ్చింది.

"ఎప్పట్నుంచో మీనా అంటే ఇష్టం నాకు! సుగుణ పెళ్ళివారి గురించి-కలిసి ఇన్వెస్టిగేషన్లు చేసినప్పుడు తనకీ నేనంటే ఇష్టమని తెలుసుకున్నాను. అందుకే ధైర్యంగా ఈ ప్రపోజల్"

సీత కాస్త తేరుకుని, "మరి సుగుణ ఎంగేజిమెంట్ ఎవరితో ముందది చెప్పండి" అంది.

"కమలా ఆంటీ వాళ్ళ అబ్బాయి కిషోర్‌తో! మొన్న మీరు లైఫ్‌స్టైల్‌లో కొన్న షర్టులు ఏమైనా పనికొస్తాయేమో చూడు ఫంక్షన్‌కి" నవ్వింది మీనా.

ఆశ్చర్యంతో నోరు తెరిచిన సీతని చూసి "ఆంటీ!" అన్నాడు రమణ.

"అమ్మా" అంది మీనా.

సీత చప్పున నోరు మూసి, "యావండీ" అనడానికి మళ్ళీ నోరు తెరిచింది.

రాఘవ ఆమెని పట్టించుకోకుండా "మీనా!" అంటూ కూతురి వంక చూసాడు.



"చెప్పునాన్నా" అంది మీనా.

"ఇదంతా ముందే నాతో ఎందుకు చెప్పలేదు?"

మీనా గొంతు సవరించుకుని, "మీకు తెలుసుగా. కిషోర్ రిఫరెన్సువల్లే నాకూ సుగుణకీ ఈ ఉద్యోగాలొచ్చాయి. కిషోర్‌కి సుగుణంటే ఇష్టమట. చెప్పడానికి సరైన సమయం కోసం ఎదురు చూస్తున్నాడు. సుగుణకి పెళ్ళి చూపులని తెలిసి కంగారుపడి వెంటనే తన ప్రపోజల్ రమణకి చెప్పేశాడు. సుగుణ మనసు తెలుసుకున్నాక మేము ఆంటీకి, అంకుల్‌కి ఆ ఆఫరు మంచిది కాదని చెప్పడంతోబాటు మంచి ఆఫరు ఏదో కూడా చూపించగలిగాం. ఆ ఇన్‌స్పిరేషన్‌తో రమణ కూడా తన మనసులో మాట చెప్పేశాడు. అంతా అన్నింటికీ ఒప్పేసుకున్నారు" అని ఆగింది.

రాఘవ ఇంకా చెప్పాల్సింది ఉందన్నట్టు ఆమెవంకే చూశాడు. మీనా కొనసాగించింది. "అంటే..నాకూ రమణంటే చిన్నప్పట్నుంచీ ఇష్టమే. కానీ మీకూ అమ్మకీ ఇష్టమైతేనే..."

"చెప్పేయండంకుల్, మీకిష్టమేకదూ" రమణ అభ్యర్థన ఎల్బీడబ్ల్యూకీలా లేదు. క్లీన్ బౌల్డ్‌కి అడుగుతున్నట్లుంది.

"ఏమంటావ్ సీతా!" అన్నాడు రాఘవ. సరిగ్గా అప్పుడే యమునా, ధర్మారావూ వచ్చారక్కడికి.

"ఇదేదో పాత తెలుగు సినిమాలో లాస్ట్ సీనులా లేదూ" సుగుణతో అంది మీనా.

"లాస్ట్ సీనైతే మరి కథ సుఖాంతమవ్వాలి కదా...మేము ఒప్పేసుకున్నాం" సంతోషంగా అన్నాడు రాఘవ భార్య కళ్ళలో మెరుపుని గమనిస్తూ.

"బాగుంది కదండీ, ఒక పెళ్ళితో మరో పెళ్ళి ఫ్రీ. వన్ ప్లస్ వన్ ఆఫర్!" సంబరపడిపోయింది సీత.

"ఉచితమే కావచ్చు కానీ ఇక్కడ ఔచిత్యం కూడా ఉంది" తెలుగుకి ప్రాచీన హోదా లభించినప్పట్నించీ మొదలెట్టిన అభ్యాసం ప్రభావాన్ని ప్రదర్శిస్తూ అంది మీనా.

ఆ భాషని జీర్ణం చేసుకునే ప్రయత్నంలో ముఖానికి పట్టిన చెమటని జేబురుమాలుతో తుడుచుకున్నాడు రమణ!

## టైమ్ బాగాలేదు

చూస్తుంటే శ్రియకి కాలం కలిసి రావడంలేదు అనిపిస్తోంది. 'శివాజీ' తర్వాత ఒక్కటంటే ఒక్క హిట్టూ లేదామెకి. అటు ఇంగ్లీషు సినిమా ఫట్‌మంది. ఇటీవల వచ్చిన హిందీ సినిమా 'ఏక్' కూడా ఫటాఫట్ అంది. ఇప్పుడు శ్రియ ఆశలన్నీ తమిళ సినిమా 'మల్లన్న'మీదే వున్నాయి. ఈ సినిమా కూడా అటూ ఇటూ అయితే కెరీర్‌కి కాస్త కష్టమే మరి అనుకుంటున్నారు సినీజనాలు. వచ్చేనెలలో ప్రేక్షకుల ముందుకి రాబోతున్న 'మల్లన్న' శ్రియకి ఏం మేలు చేస్తాడో చూడాలి!